సాక్షి అనకాపల్లి
గురువారం । 2 । జనవరి । 2025



స్వయం ప్రతిపత్తిలో తొలి అడుగు

యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వయం ప్రతిపత్తి(అటానమస్ హోదా)లో తొలి అడుగు వేయనుంది. 8లో



మంచు కురిసే వేళలో..

తగరపువలస : వేకువజామున పొగమంచుతో భీమిలి పరిసర ప్రాంతాలు ఆహ్లాదకరంగా మారాయి.



అన్నదానానికి రూ.లక్ష విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి అన్నప్రసాద పథకానికి పీఎం పాలేనికి చెందిన రాజు రూ.లక్ష 116 అందించారు.

న్యూస్‌రీల్

సప్పరం వాహనంపై వెంకన్న తిరువీధి



ఇత్తడి సప్పరం వాహనంపై స్వామివారికి తిరువీధి సేవలు నిర్వహిస్తున్న అర్చకులు

నక్కపల్లి: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా బుధవారం ఉపమాక వేంకటేశ్వర స్వామివారికి ఇత్తడి సప్పరం వాహనంపై తిరువీధి సేవలు నిర్వహించారు.ఈ సందర్భంగా స్వామివారికి వేకువ జామున అభిషేకం జరిపారు. తదుపరి ఉత్సవమూర్తులకు, క్షేత్రపాలకుడు వేణుగోపాల స్వామివారికి,గోదాదేవి అమ్మవారికి నిత్యపూజలు నిర్వహించిన అనంతరం ఉభయ దేవేరులతోకూడిన స్వామివారిని ఇత్తడి సప్పరం వాహనంలోను, గోదాదేవి అమ్మవారిని పల్లకిలో ఉంచి తిరువీధి సేవలు నిర్వహించారు. గోదాదేవి సన్నిధిలో తిరుప్పావై పాశురాలను విన్నపం చేశారు. ఆంగ్ల నూతన సంవత్సరం ప్రారంభం కావడంతో స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాలనుంచి భక్తులు తరలివచ్చారు. ఈకార్యక్రమంలో అర్చక స్వాములు వరప్రసాదాచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

సౌత్‌జోన్ హాకీ పోటీలకు యలమంచిలి క్రీడాకారులు



సౌత్‌జోన్ హాకీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

యలమంచిలి రూరల్: మద్రాస్ విశ్వవిద్యాలయంలో జరగనున్న సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొనే ఆంధ్ర విశ్వవిద్యాలయం హాకీ జట్టులో పట్టణానికి చెందిన 10 మంది క్రీడాకారులు చోటు దక్కించుకున్నారు. ఈ నెల 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు చెన్నై మద్రాస్ వర్సిటీలో జరిగే పోటీల్లో వీరు పాల్గొనున్నారు. బుధవారం చెన్నై బయలుదేరిన జట్టు సభ్యులను వర్సిటీ,యలమంచిలిలో ఏయూ స్పోర్ట్స్ విభాగం అధిపతి డాక్టర్ విజయ్‌మోహన్,జట్టు కోచ్ గాజుల రాంబాబు(యలమంచిలి), మేనేజర్ కొటారు దుర్గారావు(యలమంచిలి) అభినందించారు. సౌత్‌జోన్ హాకీ టోర్నమెంట్‌లో క్రీడాకారులు రాణించాలని వారంతా ఆకాంక్షించారు. జట్టుకు మామిడి విజయ్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు.

అల్లూరి విగ్రహం ధ్వంసం



ఎస్.రాయవరం: మండలంలోని లింగరాజు పాలెం గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు అల్లూరి విగ్రహాన్ని ధ్వంసం చేసినట్టు క్షత్రియ సేవా సమితి సభ్యులు తెలిపారు.డిసెంబర్ 31వ తేదీరాత్రి మందుబాబులు ఈ దుశ్చర్యకు పాల్పడి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బాణం, చేయి, కాలు వద్ద ధ్వంసం చేశారని, ఈ సంఘటనపై గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు వారు తెలిపారు.

ఇగ్నో ప్రవేశాలు ప్రారంభం

- దరఖాస్తుకు జనవరి 31 చివరి తేదీ

ఎంవీపీకాలనీ(విశాఖ): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) 2025 విద్యా సంవత్సరం జనవరి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. డిగ్రీ, పీజీ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో ప్రవేశాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. కేంద్రం పరిధిలోని 11 జిల్లాల విద్యార్థులు https:// ignouadmission. samarth. edu.in/ ద్వారా ఆయా కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చని సూచించారు. దరఖాస్తుకు ఈ నెల 31 చివరి తేదీ అని చెప్పారు.

స్టాఫ్ నర్సుల ఖాళీల భర్తీకి దరఖాస్తులు

మహారాణిపేట(విశాఖ): ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఖాళీగా ఉన్న 106 స్టాఫ్ నర్సు పోస్టులకు ఏడాది ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేయడానికి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ సంచాలకులు పి.రాధారాణి తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 15లోగా రేసపువానిపాలెం, డీఎంహెచ్‌వో కార్యాలయ ఆవరణలోని తమ కార్యాలయంలో సమర్పించాల్సిందిగా సూచించారు. పూర్తి వివరాల కోసం https://nagendrasvst.wordpress.com ను సందర్శించాల్సిందిగా కోరారు.

3 రోజుల్లో రూ. 15.35 కోట్లు తాగేశారు..



న్యూఇయర్‌కు కిక్కే కిక్కు..

- ఒక రోజు ముందు నుంచే భారీగా మద్యం విక్రయాలు
- డిసెంబర్ 30, 31తేదీల్లో రూ. 10.85 కోట్ల మద్యం సేల్స్
- జనవరి 1న రూ.4.5కోట్ల విక్రయాలు



సాక్షి, అనకాపల్లి:

నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మందుబాబులు మద్యంలో మునిగి తేలారు. ఏకంగా రూ.15.35 కోట్ల విలువ చేసే లిక్కర్‌తో కిక్ పొందారు. న్యూ ఇయర్ వేళ జిల్లాలో మద్యం ఏరులై పారింది. సెలబ్రేషన్స్ పేరుతో మద్యం మత్తులో మునిగి తేలారు. మంచినీళ్లలా మద్యం తాగేశారు.డిసెంబర్ 30, 31 తేదీల్లో రెండు రోజుల్లో రూ. 10,85,62,196 విలువైన మద్యం సేల్ అయింది. ఈ రెండు రోజుల్లో బీర్లు 6,043, ఐఎంఎల్ 13,616 కేసులు అమ్ముడయ్యాయి. జనవరి ఒకటో తేదీన రూ.4.5 కోట్లు విక్రయాలు జరిగాయి. మొత్తం న్యూఇయర్ వేడుకల్లో భాగంగా మూడు రోజుల్లో రూ.15.35 కోట్లు మద్యం సేల్ అయ్యింది. డిసెంబర్ 31వ తేదీన ఒక్క రోజులో అనకాపల్లి జిల్లాలో గల ఎనిమిది ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో గల 146 మద్యం దుకాణాలు, 10 బారుల్లో రూ.6.76 కోట్ల మద్యం సేల్ అయింది. జనవరి ఒకటో తేదీన రూ.4.5 కోట్లు మద్యం విక్రయాలు జరిగాయి. అర్ధరాత్రి ఒంటి గంట వరకు విక్రయాలకు అనుమతి ఉండడంతో అమ్మకాలు రెట్టింపు స్థాయిలో ఉన్నట్లు తెలుస్తోంది.నూతన సంవత్సర వేడుకల్లో భారీగా ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు ఎక్సైజ్ శాఖ డిసెంబర్ 31, జనవరి 1వ తేదీల్లో అర్ధరాత్రి ఒంటి గంట వరకు మద్యం అమ్మకాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వాస్తవానికి గత నెల డిసెంబర్ 22వ తేదీ నుంచే జిల్లాలో మద్యం విక్రయాలు జోరందుకున్నాయి. రెండు ఆదివారాల్లోను, క్రిస్మస్ రోజున సుమారు రూ.10 కోట్ల మేర అమ్మకాలు జరిగాయి. నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా మద్యం వ్యాపారులు ముందుగానే భారీ స్థాయిలో స్టాకు సిద్ధం చేసుకున్నారు.

ఏరులై పారింది..

నూతన సంవత్సరం వేళ జిల్లాలో మద్యం ఏరులై పారింది. వైన్‌షాపులు మందుబాబులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు కొనుగోలుదారులతో రద్దీగా కనిపించాయి. జిల్లాలో ఎక్సైజ్ శాఖకు సంబంధించి జిల్లాలో 8 సర్కిళ్ల పరిధిలో 146 మద్యం దుకాణాలు, 10 బార్లు ఉన్నాయి. వీటిల్లో డిసెంబర్ 30, 31వ తేదీల్లో భారీగా మద్యం విక్రయాలు జరిగాయి. సాధారణ రోజుల్లో సరాసరి రూ.3 కోట్లు మేర అమ్మకాలు జరుగుతాయి. కానీ ఈ న్యూ ఇయర్ సెలబ్రేషన్స్‌లో మందుబాబులు రెట్టింపు స్థాయిలో తాగేశారు. ఇందులో అనకాపల్లి, నర్సీపట్నం, యలమంచిలి, చోడవరం, పాయకరావుపేట సర్కిళ్ల పరిధిలో మద్యం ఎక్కువగా సేల్ అయింది. మాడుగుల, గొలుగొండ సర్కిల్ పరిధిలో తక్కువగా సేల్ అయింది.

సర్కిళ్ల వారీగా సేల్ మద్యం విక్రయాలు (రూ.లక్షల్లో)

సర్కిల్	డిసెంబర్ 31	జనవరి 1
యలమంచిలి	96	80
అనకాపల్లి	100	70
నర్సీపట్నం	100	70
చోడవరం	90	60
పాయకరావుపేట	90	50
సబ్బవరం	90	60
మాడుగుల	70	35
గొలుగొండ	40	25
మొత్తం	రూ.6.76 కోట్లు	రూ.4.5 కోట్లు

అన్నక్యాంటీన్ సెక్యూరిటీ గార్డు వీరంగం

- మద్యం మత్తులో డైనింగ్ టేబుల్ ధ్వంసం
- భయాందోళనలకు గురైన ప్రజలు



అన్న క్యాంటీన్‌లో ధ్వంసమైన టేబుల్

యలమంచిలి రూరల్: కూటమి ప్రభుత్వం పేదల ఆకలి తీర్చడానికంటూ గొప్పగా ప్రారంభించిన అన్నక్యాంటీన్‌ల నిర్వహణ అధ్వానంగా ఉంటోంది. యలమంచిలి పట్టణంలోని ప్రధాన రహదారికి ఆనుకుని ఏర్పాటు చేసిన అన్నక్యాంటీన్‌లో కాపలాగా నియమించిన సెక్యూరిటీ గార్డే బుధవారం సాయంత్రం పూటుగా మద్యం సేవించి వీరంగం సృష్టించాడు. ఇక్కడ డ్యూటీలో ఉన్న మహలక్ష్మీనాయుడు మద్యం మత్తులో లోపలకు వెళ్లి డైనింగ్ టేబుల్‌ను విరగ్గొట్టాడు.అక్కడ కనిపించిన వారందరీ భయాందోళనలకు గురిచేశాడని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కొందరు మహిళలు భయంతో అక్కడ్నుంచి వెళ్లిపోయారు.ఈ ఘటనపై స్థానిక టీడీపీ నాయకుడు ఆడారి ఆదిమూర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఘటనకు బాధ్యుడైన గార్డు జనసేనకు చెందిన వ్యక్తి కావడంతోనే తెలుగుదేశం నాయకులు ఉద్దేశపూర్వకంగా ఫిర్యాదు చేస్తున్నారని జనసేన నాయకులు ఆరోపిస్తున్నారు.అన్న క్యాంటీన్ నిర్వహణను గాలికొదిలేస్తున్నారని, ఇంటర్నెట్ బిల్లు కూడా చెల్లించలేదని,ఉదయం కాపలాగా ఉండాల్సిన గార్డును పూర్తిగా తొలగించారని, క్యాంటీన్‌కు కాపలాగా ఉండాల్సిన ఉద్యోగే మద్యం తాగి వచ్చాడని దీనిపై టీడీపీ అధిష్టానానికి ఫిర్యాదు చేస్తానని ఆదిమూర్తి తెలిపారు.ఫిర్యాదుపై విచారణ జరుపుతున్నామని పట్టణ ఎస్ఐ కె.సావిత్రి తెలిపారు.

న్యూ జోష్



కేజేపురంలో న్యూ ఇయర్ కేక్ కట్‌చేస్తున్న మాజీ ప్రభుత్వ విప్, మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ



మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్, కళావతి దంపతులకు **పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలుపుతున్న** మున్సిపల్ **వైస్‌చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి, పార్టీ మహిళా నాయకులు**



అడ్డు రోడ్డు క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు

కొత్త సంవత్సరానికి కోటి ఆశలతో మంగళవారం అర్ధరాత్రి నుంచే స్వాగతం పలికిన జిల్లా వాసులు.. బుధవారం కూడా సందడి కొనసాగించారు. పార్కులు, ఇతర సందర్శనీయ స్థలాలు జనంతో కిటకిటలాడాయి. కొత్త సంవత్సరం మొదటి రోజు కావడంతో పలువురు కుటుంబ సమేతంగా ఆలయాలను సందర్శించారు. జిల్లా అధికారులు, రాజకీయనాయకుల కార్యాలయాలు, ఇళ్ల వద్ద సందడి నెలకొంది. నాయకులకు పలువురు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

-అనకాపల్లి/మాడుగుల రూరల్/ ఎస్.రాయవరం/నర్సీపట్నం



అనకాపల్లి రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్

బోటులో మంటలు

- ప్రమాదం నుంచి బయటపడిన మత్స్యకారులు
- ఆస్తి నష్టం రూ.25 లక్షలు

భీమునిపట్నం: సముద్రంలో వేటకు వెళ్లిన బోటు ఇంజిన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వాటిని అదుపు చేసేందుకు మత్స్యకారులు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో బోటు నుంచి సముద్రంలోకి దూకి ప్రాణాలతో భీమిలికి సమీపంలోని తీరానికి చేరుకున్నారు. వివరాలివీ.. పెదవాల్తేరుకు చెందిన ఏడుగురు మత్స్యకారులు బుధవారం ఫైబర్ బోటులో 10 రోజుల పాటు చేపల వేట చేయడానికి సామగ్రితో పారాదీప్ వైపు పయనమయ్యారు. బోటును ముత్తరాజ్ అనే మత్స్యకారుడు నడుపుతున్నాడు. అయితే భీమిలి తీరం దాటి వెళుతున్న క్రమంలో బోటు ఇంజిన్ నుంచి మంటలు వచ్చాయి. ఈ మంటలు గ్యాస్, వలలు, ఇతర సామగ్రికి వ్యాపించకుండా అదుపు చేసేందుకు మత్స్యకారులు తీవ్రంగా శ్రమించారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో నీటిలో దూకి తీరానికి సురక్షితంగా చేరుకున్నారు. ఇందులో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. బోటుతో పాటు వలలు, నిత్యావసర సామగ్రి మొత్తం కాలిపోయింది. ఈ ప్రమాదంతో సుమారు రూ.25 లక్షల వరకు నష్టం వాటిల్లిందని మత్స్యకారులు తెలిపారు. తర్వాత బోటు తీరానికి కొట్టుకొచ్చింది.



దీన్‌దయాళ్ పోర్టులో డ్రెడ్జర్ పనులు

కన్సార్టియం పోర్టులకు తలనొప్పిగా డీసీఐ

రోజురోజుకూ డ్రెడ్జింగ్ కార్పొరేషన్ పనితీరు దిగజారుతుండటంపై కన్సార్టియం పోర్టులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ప్రైవేట్‌పరం కాకుండా డీసీఐని నిలబెట్టేందుకు ముఖ్య పాత్ర పోషించిన నాలుగు పోర్టుల పనుల్లో కూడా డ్రెడ్జింగ్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. సంస్థలో ఉన్న కొందరు అధికారులు తమ స్వార్థం కోసం డీసీఐని ప్రైవేటీకరణ చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. డ్రెడ్జింగ్ వ్యవహారం పెద్ద సమస్యగా పరిణమించిందని కన్సార్టియం పోర్టులు కేంద్ర పోర్టులు, షిప్పింగ్ మంత్రిత్వ శాఖకు ఫిర్యాదు చేస్తూ లేఖలు రాయడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. – సాక్షి, విశాఖపట్నం

- డ్రెడ్జింగ్ కార్పొరేషన్ తీరుపై పోర్టుల ఆగ్రహం
- పనితీరు బాగోలేదంటూ కేంద్రానికి ఫిర్యాదులు
- మరోవైపు సంస్థ ప్రైవేటీకరణకు తెరవెనుక ప్రయత్నాలు
- కీలకంగా వ్యవహరిస్తున్న కెప్టెన్ స్థాయి అధికారి?

ఏడేళ్ల కిందట డ్రెడ్జింగ్ కార్పొరేషన్(డీసీఐ) ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టినప్పుడు ఉద్యోగులు ఐక్యంగా పోరాడారు. వీరికి విశాఖ పోర్టు అథారిటీ(వీపీఏ) అండగా నిలిచింది. మరో మూడు పోర్టులతో కలిసి డీసీఐ బాధ్యతను స్వీకరించింది. విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ) 19.47 శాతం, జవహర్‌లాల్ నెహ్రూ పోర్టు ట్రస్ట్ 18 శాతం, పారాదీప్ పోర్టు ట్రస్ట్ 18 శాతం, దీన్‌దయాళ్ పోర్టు ట్రస్ట్ 18 శాతం వాటాలతో కన్సార్టియంగా ఏర్పడి డీసీఐకి మద్దతుగా నిలిచాయి. దీంతో ప్రైవేటీకరణ నిర్ణయం నిలిచిపోయింది. ఆ తర్వాత డీసీఐ లాభాల బాటలో నడిచింది. మూడేళ్ల కిందట ఎండీ, సీఈవో నియామకంలో అవకతవకలు జరిగిన విషయం వెలుగులోకి రావడంతో విజిలెన్స్ విచారణ జరిపి ఎండీని తొలగించారు. ఆ తర్వాత కొత్త ఎండీ పదవీకాలం కూడా పూర్తయింది. అప్పటినుంచే డ్రెడ్జింగ్ కార్పొరేషన్ పతనం ప్రారంభమైంది. కొత్త ఎండీ, సీఈవోను నియమించకుండా పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబేకు తాత్కాలిక బాధ్యతలు అప్పగించినా ఫలితం లేకపోయింది. ఇప్పుడు కొంతమంది అధికారులు డీసీఐని ప్రైవేట్‌కు విక్రయించేందుకు కుట్రలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కన్సార్టియం పోర్టులు కేంద్రానికి ఫిర్యాదు చేయడం ఈ ఆరోపణలకు మరింత బలం చేకూరుస్తోంది.

డీసీఐపై కేంద్రానికి లేఖలు

డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌కు కన్సార్టియం పోర్టులుగా వ్యవహరించడం ఇబ్బందికరంగా మారిందంటూ ఇటీవల దీన్‌దయాళ్ పోర్టు, పారాదీప్ పోర్టులు మంత్రిత్వ శాఖకు లేఖ రాస్తూ ఫిర్యాదు చేశాయి. తాజాగా డీసీఐకి కాంట్రాక్ట్ ఇచ్చిన మంగళూరు పోర్టు కూడా ఇదే బాట పట్టింది. డ్రెడ్జర్లకు సరిగా మరమ్మతులు చేయకపోవడం, పాత డ్రెడ్జర్లనే వాడుతుండటం వల్ల పనులు సక్రమంగా జరగడం లేదని ఈ పోర్టులు ఫిర్యాదు చేశాయి. డీసీఐకి అప్పగించిన పనుల విషయంలో అధికారుల తీరు సరిగా లేదని ఆరోపించాయి. దీన్‌దయాళ్ పోర్టు 2024 నుంచి 2027 వరకు నేవిగేషన్ చానెల్ డ్రెడ్జింగ్ పనుల కాంట్రాక్టును రూ.445.52 కోట్లకు డీసీఐకి అప్పగించింది. 10 మీటర్ల లోతు చొప్పున మొత్తం 7,400 క్యూబిక్ మీటర్ల మేర డ్రెడ్జింగ్ చేయాలని ఒప్పందం కుదిరింది. కానీ డీసీఐ కేవలం 8 మీటర్ల మేరకే తవ్వకాలు చేసిందని పోర్టు అధికారులు ఆరోపించారు. దీనివల్ల భారీ నౌకలను నిర్వహించలేని పరిస్థితి ఏర్పడి, పోర్టుకు నష్టం వాటిల్లిందని మంత్రిత్వ శాఖకు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఇదే విధంగా డీసీఐ తమ పోర్టుల్లోనూ వ్యవహరించిందని మిగతా పోర్టులు ఆరోపించాయి. ఇలాంటి కారణాల వల్ల ఒప్పందాలను రద్దు చేసుకునేందుకు కూడా తాము సిద్ధంగా ఉన్నామని ఆ పోర్టులు స్పష్టం చేస్తున్నాయి.

పాత డ్రెడ్జర్లతో పనులా.?

పారాదీప్ పోర్టులో డీసీఐ రెండు కాలం చెల్లిన డ్రెడ్జర్లతో పనులు నిర్వహించి అస్తవ్యస్తంగా చేసింది. 2025 జనవరి నాటికి 7.5 మిలియన్ క్యూబిక్ మీటర్ల మేర డ్రెడ్జింగ్ చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం 4.8 మిలియన్ క్యూబిక్ మీటర్లు మాత్రమే పూర్తయింది. మరో డ్రెడ్జర్‌ను అందుబాటులోకి తెస్తే పనులు వేగవంతం చేయవచ్చని పోర్టు అధికారులు సూచించినప్పటికీ, డీసీఐ అధికారులు స్పందించడం లేదు. డీసీఐ తన ఉన్న పది డ్రెడ్జర్లతో ప్రధాన పోర్టుల పనులన్నీ పూర్తి చేయాలని ప్రయత్నిస్తున్నప్పటికీ, అవి పాతబడిపోవడంతో లక్ష్యాలను చేరుకోలేకపోతోంది. డ్రెడ్జర్ల మరమ్మతులు, కొత్త వాటి కొనుగోలుపై అధికారులు శ్రద్ధ చూపడం లేదు. కొన్ని సందర్భాల్లో డీసీఐ టెండర్లు పొంది, వాటిని వేరే సంస్థలకు సబ్ టెండర్లుగా ఇవ్వడం వల్ల ఆదాయం కోల్పోతోంది. దీంతో డీసీఐ నష్టాలను చవిచూస్తోంది.



డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం

ప్రైవేట్ సంస్థకు డేటా విక్రయం?

డీసీఐని ప్రైవేట్ కంపెనీకి కట్టబెట్టేందుకు కొందరు ఉన్నతాధికారులు కుట్ర పన్నుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. డీసీఐ ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఒక అధికారి ఇటీవల తన ఉద్యోగానికి రాజీనామా చేసి గుజరాత్ కేంద్రంగా పనిచేస్తున్న ఓ సంస్థలో చేరినట్లు తెలుస్తోంది. డీసీఐకి సంబంధించిన సాంకేతిక వ్యవహారాలు, ఇతర లావాదేవీలు, ఒప్పందాలు, ముఖ్య సమాచారాన్ని ఆ ఉద్యోగి ఆ సంస్థకు విక్రయించాడని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయం తెలిసినప్పటికీ గతంలో ఎండీగా వ్యవహరించి ప్రస్తుతం ఉన్నతాధికారిగా ఉన్న ఒక కెప్టెన్ స్థాయి అధికారి కనీసం పట్టించుకోలేదని తెలుస్తోంది. ఈయన వ్యవహార శైలిపై డీసీఐ ఉద్యోగ వర్గాల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అధికారి ఈ కుట్రలో కీలక భాగస్వామి అని, మొత్తంగా డీసీఐని ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టి తానే సర్వాధికారిగా వ్యవహరించేలా కుయుక్తులు పన్నుతున్నట్లు సమాచారం. పోర్టులు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేపట్టేందుకు కేంద్ర షిప్పింగ్ మంత్రిత్వ శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది.

క్లుప్తంగా

ఆర్‌ఈసీఎస్ పూర్వ వైభవానికి కృషి

తుమ్మపాల: అవినీతి కొరల్లో కూరుకుపోయిన ఆర్‌ఈసీఎస్‌పై అవసరమైతే ఏసీబీ విచారణ చేపట్టి, పూర్వ వైభవం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. అనకాపల్లి పట్టణంలోని గవరపాలెం కొణతాల స్మృతి వనంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్‌ఈసీఎస్‌లో ఏర్పాటు చేసిన పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులకు నాలుగు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. రీడర్స్‌గా ఉద్యోగాల్లో ఉన్న సిబ్బందిని లైన్‌మన్‌లుగా వినియోగించడం అన్యాయమని చెప్పారు. జీతానికి తగ్గ పీఎఫ్ కూడా ఉద్యోగులకు జమ చేయడం లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సుగర్ ఫ్యాక్టరీని ఇథనాల్ పరిశ్రమగా అభివృద్ధి చేసేందుకు తగ్గ చెరకు ఉత్పత్తి లేకపోవడంతో ప్రత్యామ్నాయ పరిశ్రమల ఏర్పాటుకు ప్రణాళిక చేస్తున్నామన్నారు. లక్ష్మీదేవిపేట రైల్వే వంతెన పనులు పునః ప్రారంభించనున్నామన్నారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలు ఒకే చోట నిర్మించేలా స్థల అన్వేషణ చేస్తున్నామని చెప్పారు.

నేటి నుంచి స్పోర్ట్స్ మీట్

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 2 నుంచి 4 వరకు మూడు రోజులపాటు 27వ ఇంటర్ పాలిటెక్నిక్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ నారాయణరావు ఓ ప్రకటనలో తెలిపారు. 8 ప్రభుత్వ పాలిటెక్నిక్‌లతో పాటు, 19 ప్రైవేట్ పాలిటెక్నిక్‌లలోని 16 కాలేజీల నుంచి మొత్తం 1,116 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు.

స్వయం ప్రతిపత్తిలో తొలి అడుగు

- నేటి నుంచి యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్, అటానమస్ హోదా
- తొలిసారి సెమిస్టర్ పరీక్షలు రాయనున్న 311 మంది విద్యార్థులు



పరీక్షల అనంతరం జవాబు పత్రాలు భద్రపర్చనున్న స్ట్రాంగ్ రూం



యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల

యలమంచిలి రూరల్: యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వయం ప్రతిపత్తి(అటానమస్ హోదా)లో తొలి అడుగు వేయనుంది. గురువారం నుంచి ఈ కళాశాలలో తొలిసారి ప్రత్యేక హోదాలో తొలి థియరీ(సెమిస్టర్) పరీక్షల నిర్వహణకు సిబ్బంది సర్వం సిద్ధం చేశారు. గురువారం నుంచి ఈ నెల 9వ తేదీ వరకు బీఏ, బీఎస్సీ, బీకాం చదువుతున్న 8 గ్రూపులకు చెందిన మొదటి సంవత్సరం విద్యార్థులు సుమారు 310 మంది తొలి సెమిస్టర్ పరీక్షలు రాయనున్నారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ పి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పక్కాగా ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే ఇన్విజిలేటర్లు, స్క్వాడ్ సిబ్బందిని నియమించారు. ప్రశ్నపత్రాల తయారీలో పటిష్టమైన నిబంధనలు పాటిస్తూ పరీక్షల ప్యానల్ బోర్డు ఆధ్వర్యంలో ప్రక్రియ పూర్తి చేశారు. ప్రశ్న పత్రాల రూపకల్పన, జవాబు పత్రాల ఖాళీ బుక్‌లెట్ల ముద్రణలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకున్నారు.

అటానమస్‌తో అవకాశాలెన్నో..

స్వయం ప్రతిపత్తి హోదాతో స్థానిక అవసరాలకు అనుగుణంగా 20 శాతం సిలబస్‌లో మార్పులు చేసుకునేందుకు ఈ కళాశాలకు అవకాశం దక్కింది. పరీక్షల నిర్వహణ, ఫలితాల వెల్లడి, సొంత విద్యా క్యాలెండర్ అమలు కానున్నాయి. అనకాపల్లి జిల్లాలో యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మాత్రమే స్వయం ప్రతిపత్తి హోదా లభించింది. సంప్రదాయ కోర్సులతో పాటు స్థానిక అవసరాలకు తగినట్లుగా నైపుణ్యాభివృద్ధి, ఇతర సర్టిఫికెట్ కోర్సులు ప్రవేశపెట్టే అవకాశం కూడా ఉంటుంది. దీంతో భవిష్యత్తులో ఈ కళాశాల మినీ విశ్వవిద్యాలయంగా అభివృద్ధి చెందనుంది. అయితే అటానమస్ హోదా నిలుపుకొనేందుకు కళాశాల అధికారులు తీవ్రంగా కష్టపడాల్సి ఉంటుంది. యూజీసీ నిబంధనల మేరకు నిర్దేశించిన ప్రమాణాలు పాటించాల్సిన బాధ్యత ఉంటుంది.

విద్యార్థులకు ఎంతో ప్రయోజనం



అటానమస్ హోదాతో ఈ ప్రాంతంలో విద్యార్థులకు ఎంతో ప్రయోజనం. ముఖ్యంగా స్థానికంగా ఉపాధి, అవసరాలకు తగినట్లుగా కోర్సులు నిర్వహించుకోవచ్చు. ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు సాఫీగా జరగడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇప్పటికే విద్యార్థులకు హాల్ టికెట్లు అందజేశాం. పరీక్షల నియంత్రణ అధికారి పర్యవేక్షణలో ప్రశ్న పత్రాలు, జవాబు పత్రాల బుక్‌లెట్లు సిద్ధం చేశాం. అటానమస్ హోదాతో నిర్వహిస్తున్న తొలి పరీక్షల నిర్వహణలో లోపాలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. బోర్డ్ ఆఫ్ స్టడీస్ అనేది స్వయం ప్రతిపత్తి కలిగిన కళాశాల విద్యావ్యవస్థలో అత్యంత ముఖ్యమైన ప్రాథమిక విభాగం. ప్రస్తుతం నిర్వహిస్తున్న పరీక్షలు పూర్తయిన తర్వాత విద్యార్థులు రాసిన జవాబు పత్రాలను నిబంధనల ప్రకారం సుమారు 5 నుంచి 10 సంవత్సరాలు భద్రపరుస్తాం.

– డాక్టర్ పి.చంద్రశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గుర్తింపు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఈ కళాశాలకు రూ.2 కోట్ల రూసా నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో కళాశాలలో అదనపు తరగతి గదులు, ప్రయోగశాలలు, అత్యాధునిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేశారు. విద్యార్థులు సాధించిన ఫలితాలు, అన్ని మౌలిక సదుపాయాలు ఉండడంతో కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్ వచ్చింది. ఆ తర్వాత దశల వారీగా అటానమస్ హోదా కోసం కళాశాల అధికారులు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ)కు దరఖాస్తు చేశారు. పరిశీలన జరిపిన యూజీసీ ఈ కళాశాలకు పదేళ్ల స్వయం ప్రతిపత్తి హోదా కల్పించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు కూడా గత ప్రభుత్వ హయాంలోనే 2023 నవంబరు 13న విడుదలయ్యాయి. దీని ప్రకారం 2024–25 విద్యా సంవత్సరం నుంచి 2033–34 వరకూ కళాశాలకు అటానమస్ స్టేటస్ కొనసాగనుంది. కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్ కూడా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 2023 మే నెలలో దక్కింది.

8న విశాఖకు ప్రధాని మోదీ

మహారాణిపేట: ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 8న విశాఖపట్నం వస్తున్నారు. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో నేరుగా విశాఖ చేరుకుంటారు. ఆంధ్రా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారు. తిరిగి అదే రోజు ఢిల్లీకి పయనమవుతారు.

'పది'లో ప్రథమ స్థానమే లక్ష్యం

- కలెక్టర్ విజయ కృష్ణన్
- యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి: ఈ ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో రాష్ట్రంలో అనకాపల్లి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచేలా ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ సూచించారు. కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో బుధవారం ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) 2025 క్యాలెండర్, డైరీని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఉపాధ్యాయులు ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్, కోశాధికారి జోగా రాజేష్, ఉపాధ్యక్షులు రొంగలి అక్కునాయుడు, పి.గాయత్రి, జిల్లా కార్యదర్శులు జి.ఎస్.ప్రకాష్, మాకిరెడ్డి రాజునాయుడు, రాష్ట్ర కౌన్సిలర్ ఎం.వి.అప్పారావు పాల్గొన్నారు.

36 కిలోల గంజాయి స్వాధీనం

ఢిల్లీకి చెందిన నిందితుడి అరెస్ట్

సీతమ్మధార: రైల్వేస్టేషన్ చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు మూడు బ్యాగుల్లోని 36 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఢిల్లీకి చెందిన ఖుర్బాన్‌ఖాన్ అలియాస్ ఉమేష్, మహిళ పారో గత నెల 28న అక్కడ బయలుదేరి.. 29న విశాఖ చేరుకుని స్టేషన్‌లోనే ఉన్నారు. 30న వీరిద్దరూ కిరండోల్ రైలు ఎక్కి.. బెజ్జా రైల్వే స్టేషన్‌లో దిగారు. అదే రైలులో ఉన్న ఓ మహిళ వీరికి గంజాయి అందజేసింది. వీరిద్దరూ రాత్రి బెజ్జా స్టేషన్‌లోనే ఉన్నారు. 31న అక్కడి నుంచి విశాఖ బయలుదేరారు. వీరికి గంజాయి విక్రయించిన మహిళ పాడువా స్టేషన్‌లో దిగిపోయింది. వీరిద్దరూ విశాఖ రైల్వేస్టేషన్‌కు చేరుకోగా బ్యాగుల వద్ద ఉమేష్ ఉన్నారు. చెక్‌పోస్టు పోలీసులకు అనుమానం వచ్చి తనిఖీ చేశారు. 36 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని.. ఉమేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఇది గమనించిన పారో అక్కడి నుంచి పరారైంది. ఆమె మొబైల్ ఫోన్‌ను ట్రాక్ చేయగా డాబా గార్డెన్స్‌లో ఉన్నట్లు చూపింది. వెంటనే పోలీసులు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అని వచ్చింది. దీంతో ఆమె కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఉమేష్‌ని న్యాయస్థానంలో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. సీఐ సత్యనారాయణ పర్యవేక్షణలో కేసు దర్యాప్తు జరుగుతోంది.

ఆస్తమా అలర్ట్



- చలి, శీతల గాలుల ప్రభావంతో పెరుగుతున్న ఆస్తమా కేసులు
- ఛాతీ, ముక్కు సంబంధిత సమస్యలతో ఉక్కిరిబిక్కిరి
- విమ్స్, ఛాతీ, ఈఎన్‌టీ ఆస్పత్రులకు రోగుల తాకిడి



ప్రభుత్వ ఛాతీ ఆస్పత్రిలో పరీక్షల కోసం వేచి ఉన్న రోగులు

బీచ్‌రోడ్డు: కొద్దిరోజులుగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. బంగాళాఖాతంలో అల్పపీడనాలు.. శీతల గాలులతో ఉదయం, రాత్రి వేళల్లో చలి తీవ్రత పెరిగింది. నగర శివారుల్లో మంచు కురుస్తోంది. దీంతో ఆస్తమా, సైనసైటిస్, అలర్జీలతో కొందరు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఆస్పత్రులకు వస్తున్న రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని వైద్యులు చెబుతున్నారు. పెదవాల్తేరులోని ఛాతీ, ఈఎన్టీ ఆస్పత్రులతో పాటు విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)కు ఈ లక్షణలతో వచ్చే రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది.

పెరుగుదలకు కారణమిదే..

శీతాకాలంలో వ్యాప్తి చెందే కొన్ని రకాల వైరస్‌ల వల్ల ఆస్తమా కేసులు పెరుగుతుంటాయని వైద్యులు చెబుతున్నారు. శ్వాసనాళంలోని గొట్టాలు ముడుచుకుపోయి గాలి లోపలకు వెళ్లనీయకుండా, బయటకు పోకుండా అడ్డుపడతాయని, దీనివల్ల ఆయాసం వస్తుందని, అనంతరం ఆస్తమాకు దారితీస్తుందని చెబుతున్నారు. జలుబుతో పాటు ఉదయం రాత్రి వేళల్లో ఎక్కువ దగ్గుతో ప్రారంభమవుతుందని, కొందరిలో వంశపారపర్యంగా ఆస్తమా వస్తుందని చెబుతున్నారు. అలాగే చల్లని గాలులు వీయటం ద్వారా అప్పటికే సైనసైటిస్, అలర్జీలతో బాధపడుతున్న వారి సమస్యలు పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు. ముక్కు కండరాలు చలికి గట్టిపడంతో ఈ సమస్యలు పెరుగుదలకు ప్రధాన కారణంగా చెప్పవచ్చు. ప్రధానంగా దుమ్ము, చల్లదనం, పుప్పొడి, ఉన్ని, జూలుతో కూడిన పెంపుడు జంతువులు, వైరస్, బాక్టీరియాలు, వాయు కాలుష్యం కారణాలుగా పేర్కొంటున్నారు.

వెంటాడుతున్న మందుల కొరత

అవుట్ పేషెంట్, ఇన్‌పేషంట్ల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా ఛాతీ ఆస్పత్రిలో ఇన్‌పేషంట్ల సంఖ్య 90 నుంచి 170కు పెరిగింది. రెండేళ్లతో పోల్చుకుంటే ఈ ఏడాది కేసులు సంఖ్య బాగా పెరిగాయని వైద్యాధికారులు చెప్తున్నారు. అయితే వారికి అందజేసే మందుల్లో కొరత కనిపిస్తుంది. సిట్రజన్, ఇన్‌హేలర్స్, యాంటీబయోటిక్స్, పెయిన్ కిల్లర్స్ మాత్రలు అందుబాటులో ఉన్నా.. ఛాతిలో పేరుకుపోయిన ఇన్‌ఫెక్షన్లను తొలగించే పాలీ మోనో క్లియర్, మోనోసెఫ్ ఇంజక్షన్లు, జోస్టం వంటి ఇంజక్షన్ల కొరత ఉంది.

చిన్నపిల్లల్లో అధికం

చిన్న పిల్లల వైద్యులు, పల్మనాలజిస్టులు అందుబాటులో ఉన్న ఆస్పత్రులకు ప్రతిరోజూ కనీసం పది నుంచి 20 వరకు ఆస్తమా లక్షణాలతో రోగులు వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఆస్తమాతో బాధపడుతున్న చిన్నారుల సంఖ్య రెండు వారాలుగా క్రమంగా పెరుగుతోందని చెబుతున్నారు. రానున్న రోజుల్లో చలి తీవ్రత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

ఇవీ లక్షణాలు

ఆస్తమా బారినపడిన పెద్దల్లో అయితే ఊపిరి ఆడకపోవడం, ఆయాసం వంటి ఇబ్బందులుంటాయి. చిన్నారుల్లో పిల్లి కూతలు, డొక్కలు ఎగరేయడం, దగ్గు, జ్వరం, ఏడాది లోపు పిల్లల్లో శరీరం నీలంగా మారిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయని నిపుణులు చెబుతున్నారు. సైనసైటిస్, ముక్కు అలర్జీలతో బాధపడుతున్న వారిలో ఊపిరి అందకపోవటం.. గొంతు వద్ద నొప్పి పెరగడం, నిరంతరం జలుబు చేయటం వంటి లక్షణాలు ఉంటాయి.

మూడు రోజులకు మించి ఉంటే..



గత రెండేళ్లతో పోల్చుకుంటే ఈ ఏడాది రోగులు సంఖ్య పెరిగింది. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నాం, మందులకు ఇబ్బంది లేకుండా ముందుగానే పెద్ద సంఖ్యలో స్టోర్ చేసుకున్నాం. మూడు రోజులకు మించి దగ్గు, ఆయాసం వంటి లక్షణాలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఇంట్లో తప్పకుండా జాగ్రత్తలు పాటించాలి.

– డాక్టర్ సునీల్‌కుమార్, సూపరింటెండెంట్, ఛాతీ ఆస్పత్రి

అప్రమత్తంగా ఉండాలి



వాతావరణంలో మార్పులతో పాటు శీతలగాలులు కారణంగా ఆస్తమా, సైనసైటిస్, ముక్కు అలర్జీలతో బాధపడుతున్న రోగుల సంఖ్య పెరుగుతోంది. విమ్స్‌లో ఛాతీ, చిన్న పిల్లలు, ఈఎన్టీ వైద్యులు అందుబాటులో ఉన్నారు. గతంతో పోల్చుకుంటే ఈ విభాగాలకు వచ్చే రోగుల సంఖ్య రెట్టింపు అయింది. అవుట్ పేషెంట్లు గతంలో 100 వరకు వస్తే ఇప్పుడు 180 దాటుతున్నారు. ఇన్ పేషెంట్ల సంఖ్య గతంలో 40 ఉంటే ఇప్పుడు 70 వరకు పెరిగింది.

– డాక్టర్ కె.రాంబాబు, డైరెక్టర్, విమ్స్

పర్యాటకం కళకళ



చాపరాయి గార్డెన్ వద్ద ఫొటోలు తీసుకుంటున్న పర్యాటకులు



కొత్తపల్లి జలపాతం వద్ద పర్యాటకుల సందడి

జి.మాడుగుల: కొత్తపల్లి జలపాతం సందర్శనకు తెలుగు రాష్ట్రాల నుంచి ప్రత్యేక వాహనాల్లో భారీ సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. జలపాతంలో స్నానాలు చేస్తూ సందడి చేశారు. ఫొటోలు, సెల్ఫీలు దిగారు. ప్రకృతి అందాల మధ్య ఉల్లాసంగా గడిపారు.

డుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి జలవిహారిలో స్థానిక గిరిజనులు థింసా నృత్యాలతో పర్యాటకులను అలరించారు. వారితో కలిపి పర్యాటకులు నృత్యం చేస్తూ సందడి చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు కూడా న్యూఇయర్ వేడుకల్లో భాగంగా థింసా నృత్యాలతో అలరించారు.

చింతపల్లి: మండలంలో లంబసింగిలో సందడి నెలకొంది. నూతన సంవత్సరం సందర్భంగా మైదాన ప్రాంతాల నుంచి భారీగా పర్యాటకులు తరలివచ్చారు. చెరువులవేనం వ్యూపాయింట్ సందర్శకులతో కిక్కిరిసిపోయింది. పాల సముద్రాన్ని తలపించే మంచు అందాలను చూసి పరవశించిపోయారు. సెల్ఫీలు, ఫొటోలు తీసుకుని సందడి చేశారు. తాజంగి జలాశయానికి పర్యాటకుల తాకిడి నెలకొంది. బోటు షికారు, జిప్ లైన్ ఎక్కి ప్రకృతి అందాలను ఆస్వాదించారు.

ఆలివ్ రిడ్లే సంరక్షణలో మత్స్యశాఖ

- వలు ప్రభుత్వ శాఖలను భాగస్వామ్యం
- వేట సమయంలో జాగ్రత్తలపై మత్స్యకారులకు అవగాహన

ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణకు మత్స్యశాఖ నడుం బిగించింది. ఇందుకు వివిధ ప్రభుత్వ శాఖలను భాగస్వామ్యం చేస్తోంది. అటవీ, మెరైన్ పోలీసులు, కేంద్ర ప్రభుత్వ అధీనంలో ఉన్న పలు మత్స్యశాఖలు, వాటి అనుబంధ సంస్థల సహకారంతో వీటి సంరక్షణ చర్యలు చేపట్టింది.

మహారాణిపేట: ఆలివ్ రిడ్లే తాబేళ్లు తీరంలో గుడ్లు పెట్టేందుకు కొన్ని వందల మైళ్లు ప్రయాణించే సమయంలో ఫిషింగ్ వలలకు చిక్కుకుని మరణిస్తున్నాయి. దీనికితోడు సముద్ర కాలుష్యం, తాబేళ్లు గుడ్లు పెట్టే ప్రదేశాలకు సమీపంలో కంపెనీలు, ఇతర నిర్మాణాలు చేపట్టడం, తీరంలో పెట్టిన గుడ్లను కుక్కలు, ఇతర జంతువులు తినడం, తాబేళ్ల షెల్స్/మాంసం కోసం జరిగే వేటలో తాబేళ్ల సంఖ్య క్రమేపీ తగ్గుతోంది. ఈ నేపథ్యంలో మత్స్యశాఖ వీటి సంరక్షణ చర్యలు చేపట్టింది.

ఒడిశా తీరం ప్రసిద్ధి

'ఆలివ్ రిడ్లే'జాతికి చెందిన తాబేళ్లు పసిఫిక్, అట్లాంటిక్, ఇండియన్ సముద్రంలో నివసిస్తాయి. వీటి ఉపరితల కవచం(షెల్) ఆలివ్ గ్రీన్ రంగులో ఉండడం వలన వీటిని 'ఆలివ్ రిడ్లే'తాబేళ్లుగా పిలుస్తారు. ఇవి 35–45 కేజీల వరకు పెరుగుతాయి. సముద్ర ఉపరితలం నుంచి సుమారు 150 మీటర్ల లోతు వరకు సంచరిస్తాయి. ఆల్గే రకపు నాచు, నత్తలు, జెల్లీ ఫిష్, చేపల్ని ఆహారంగా తింటాయి. ఆలివ్ రిడ్లే తాబేళ్లకు ఒడిశా తీరంలోని గహిర్మాత ప్రాంతం ప్రసిద్ధి. ఇవి ఎక్కువగా ఒడిశాలోని దేవి, రుషికుల్యా, రూకరీ తీరంలో గుడ్లు పెడతాయి. సాధారణంగా ఆంధ్రప్రదేశ్ తూర్పు తీర ప్రాంతంలో నవంబరు నుంచి జనవరి వరకు గుంపులుగా గుడ్లు పెటేందుకు ఆడ తాబేళ్లు తీరానికి వస్తాయి. ఒక్కొక్క తాబేలు 100–110 వరకు గుడ్లు పెడతాయి. ఈ గుడ్లు 50–60 రోజులలో పొదిగి, పిల్లలు సముద్రంలోకి చేరుకుంటాయి.



మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సంరక్షణ చర్యలు

- ఒడిశా తీరంలో గహిర్మాత, రుషికుల్యా తదితర ప్రాంతాల్లో తాబేళ్లు గుడ్లు పెట్టే కాలంలో సముద్రంలో చేపల వేట నిషేధం కొన్నేళ్లుగా వస్తున్న సంప్రదాయం.
- తాబేళ్లు తీరానికి గుడ్లు పెట్టేందుకు వచ్చే అక్టోబర్ నుంచి ఫిబ్రవరి నెలల మధ్య తాబేళ్లకు నష్టం కలిగించే వేట పద్ధతుల విడనాడాలి.
- తెగిన తాళ్లు, వలలు, ప్లాస్టిక్ వ్యర్థాలను సముద్రంలో వేయకూడదు.
- ప్రభుత్వం తాబేళ్ల రక్షణ కోసం ప్రకటించిన 'నో ఫిషింగ్ జోన్'లో చేపల వేట చేయరాదు. – వన్యప్రాంతాల సంరక్షణ చట్టం–1972 ప్రకారం తాబేళ్లు పట్టడం, శరీరభాగాల వినియోగం, రవాణా నిషేధం.
- తాబేళ్ల సంరక్షణ దృష్ట్యా మత్స్యకారులు వలలో తాబేళ్లు తప్పించుకునే పరికరా(టీఈడీ)లను అమర్చి వేట సాగించాలి.
- ప్రమాదవశాత్తూ వలలకు చిక్కుకున్న తాబేళ్లను బతికున్నప్పుడే వేరుచేసి సురక్షితంగా సముద్రంలో విడిచిపెట్టాలి. ఆ తర్వాతే చేపల వేట కొనసాగించాలి.

మత్స్యకారులకు అవగాహన

ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణపై మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్నాం. ఇటీవల ఫిషింగ్ హార్బర్‌లో ఏపీ మరపడవల సంఘం కార్యాలయంలో వారితో సమావేశం నిర్వహించాం. ఎంపెడా, నెట్‌ఫిష్ శాఖలకు చెందిన శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొని మత్స్యకారులకు తాబేళ్ల సంరక్షణపై పలు అంశాలను వివరించారు.

– పి.లక్ష్మణరావు, జాయింట్ డైరెక్టర్, మత్స్యశాఖ

మన్యంపై చలి పంజా

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా చలిగాలులు అధికమయ్యాయి. పాడేరు డివిజన్‌లోని 11 మండలాల్లో చలి తీవ్రత మరింత అధికంగా ఉంది. పొగమంచు దట్టంగా కురుస్తోంది. సాయంత్రం నాలుగు గంటల నుంచి చలిగాలులు విజృంభిస్తున్నాయి. న్యూఇయర్ వేడుకులకు మన్యానికి వచ్చిన పర్యాటకులు ఫైర్ క్యాంపులను ఆశ్రయించారు. పొగమంచు, చలిగాలులు తీవ్రతతో ఏజెన్సీలోని అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

చింతపల్లి: ఏజెన్సీలో బుధవారం డుంబ్రిగుడలో 9.0 చింతపల్లిలో 10.0 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. పాడేరు డివిజన్‌లోని అరకువ్యాలీలో 10.1,జి. మాడుగులలో 10.4 , పెదబయలులో 10.6, పాడేరులో 10.6, హుకుంపేటలో 11.0, అనంతగిరిలో 12.9, కొయ్యూరులో 15.7 డిగ్రీలు నమోదు అయినట్టు ఆయన పేర్కొన్నారు.

కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు



పాడేరులో కురుస్తున్న పొగమంచు

న్యూ ఇయర్ వేడుకల్లో విషాదం

- రుషికొండ ఐటీ బీచ్‌లో యువకుడి మృతి
- ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన కనోజ్

పీఎంపాలెం: నూతన సంవత్సర వేడుకల్లో విషాదం నెలకొంది. ఛత్తీస్‌గఢ్ నుంచి నగరానికి వచ్చిన యువకుడు సముద్రపు అలలకు బలైపోయాడు. ఈ ఘటనకు సంబంధించి పీఎంపాలెం సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలివీ.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయ్‌పూర్‌కు చెందిన వై.కనోజ్(27) నూతన సంవత్సర వేడుకల కోసం ముగ్గురు యువతులతో కలిసి బుధవారం నగరానికి వచ్చాడు. బీచ్‌రోడ్డులోని రుషికొండ ఐటీ బీచ్‌లో నలుగురూ స్నానానికి దిగారు. ఈ క్రమంలో పెద్దగా వచ్చిన అలకు నలుగురూ సముద్రంలో మునిగిపోతుండగా, పోలీసులు, పర్యాటకులు గమనించి లైఫ్‌గార్డులను అప్రమత్తం చేశారు. వెంటనే వారు రంగంలోకి దిగి యువతులను ప్రాణాలతో రక్షించారు. కనోజ్ నీట మునిగిపోయాడు. లైఫ్‌గార్డులు అతన్ని ఒడ్డుకు తీసుకువచ్చే సరికే మరణించి ఉన్నాడు. కనోజ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



మృతుడు కనోజ్ డ్రైవింగ్ లైసెన్స్

క్లుప్తంగా

28లోగా లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి



సర్టిఫికెట్లు ఆన్‌లైన్ చేస్తున్న ఖజనా అధికారి సుభాషిణి

అనకాపల్లి: ప్రభుత్వ పింఛన్‌దారులు 28వ తేదీలోపు లైవ్ సర్టిఫికెట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్డాది జగన్నాథరావు తెలిపారు. స్థానిక మెయిన్‌రోడ్డులోని జిల్లా ఖజానాధికారి కార్యాలయంలో అధికారి వి.ఎల్.సుభాషిణికి సంఘం సభ్యులు లైవ్ సర్టిఫిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పింఛన్‌దారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న సర్టిఫికెట్ల ప్రింటెడ్ కాపీలను జిల్లా ఖజానాశాఖ కార్యాలయంలో అందజేయాలని అధికారి సుభాషిని తెలిపారు. లేనిపక్షంలో మార్చి 1 నుంచి ప్రభుత్వ పింఛన్ నిలుపుదల జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది సలీం, టి.విజయ, సంఘం జిల్లా కార్యదర్శి బీఎల్ఎన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వస్త్రదానం



దివ్యాంగులకు వస్త్రాలు అందజేస్తున్న దాత రాము

నర్సీపట్నం : నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని పట్టణంలోని శ్రీరామాంజనేయ బట్టల వ్యాపారి రాము దివ్యాంగులకు ఉచితంగా వస్త్రాలు పంపిణీ చేశారు. నర్సీపట్నం పరిసర ప్రాంతాల్లోని 500 మందికి వస్త్రాలు అందజేశారు. ఆయనకు మేము సైతం దివ్యాంగుల సమాఖ్య సంఘం ప్రెసిడెంట్ మద్దు నరేష్‌ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం వైస్ ప్రెసిడెంట్ టి.కుమార్, అదిరెడ్డి ప్రసాద్, శెట్టి ప్రసాద్ పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 2,303 దిమ్మలు వచ్చాయి

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,000	5,090
మొదటి రకం	3,910	4,610
రెండో రకం	3,470	4,360
మూడో రకం	3,170	3,460

అనకాపల్లి సినిమాలు

పుష్ప-2	:	సత్యనారాయణ స్క్రీన్-1
ముఫాసా	:	సత్యనారాయణ స్క్రీన్-2
యూఐ	:	పర్తిసాయి
మ్యాక్స్	:	షిర్డీసాయి
క్రేవెన్ ది హంటర్	:	వెంకటేశ్వర
సై	:	శ్రీసత్య
మార్కో	:	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 27 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-11 యూనిట్లు, ఓ పాజిటివ్-12 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్‌ను (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 298 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 224 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబరులో సంప్రదించవచ్చు.

రైతన్నల నేస్తం

మండలంలో మెగా ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం రైతులకు చేరువ అయింది. దీనికి అనుబంధంగా 12 గ్రామాల్లో చిన్న ప్రకృతి వనరుల కేంద్రాలు కూడా ఏర్పాటు చేశారు. దీంతో ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండిస్తున్న రైతులకు సాగుకు ఉపయోగించే ద్రావణాలు, కషాయాలు, విత్తనాలు సకాలంలో అందివ్వ డానికి అవకాశం కలిగింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం
- సాగుకు ఉపయోగించే ద్రావణాలు, కషాయాలు, విత్తనాల అందజేత
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు



విక్రయానికి సిద్ధంగా ఉన్న ద్రావణాలు, కషాయాలు



లాలంకొత్తూరులో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం

కశింకోట: మండలంలోని 15 ప్రకృతి వ్యవసాయ గ్రామాల్లో పంటలను సాగు చేస్తున్నారు. సుమారు 2088 ఎకరాల్లో 2463 మంది రైతులు ఏటా సాగు నిర్వహిస్తున్నారు. కూరగాయలు, వరి, పప్పు ధాన్యాలు, పండ్ల తోటలు వగైరా పంటలు పండిస్తున్నారు. సొంత అవసరాలకు వినియోగించడంతో పాటు ప్రజలకు కూడా వీటిని సంతల్లో విక్రయిస్తూ ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. వీరు ప్రకృతి వ్యవసాయంలో వినియోగించే వివిధ రకాల ఎరువులు, ద్రావణాలు, కషాయాల తయారీపై ప్రకృతి వ్యవసాయ సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లి గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించే వారు. వాటి తయారీకి సమయం ఎక్కువ పట్టేది. సకాలంలో పంటకు ఉపయోగపడక నష్టపోయే పరిస్థితి. ఇది వ్యయ ప్రయాసలతో కూడిన వ్యవహారంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రకృతి వ్యవసాయ శాఖ ఆసక్తి ఉన్న సిబ్బందికి రాష్ట్ర స్థాయిలో గత ఏడాది అక్టోబర్‌లో వారం రోజుల పాటు ద్రావణాలు, కషాయాల తయారీపై శిక్షణ నిర్వహించారు. దీంతో శిక్షణ పొందిన సిబ్బందిని ప్రోత్సహించి మండల స్థాయిలో మెగా ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని ఏర్పాటు చేయించారు. దీనిలో భాగంగా మండలంలోని సుందరయ్యపేట శివారు లాలంకొత్తూరులో ప్రకృతి వ్యవసాయ కేంద్రాన్ని గ్రామ స్థాయిలో రెండు నెలల క్రితం ఏర్పాటు చేశారు. దానికి అనుబంధంగా రామన్నపాలెం, విసన్నపేట, నూతలగుంటపాలెం, తాళ్లపాలెం-1,2,3,4, బంగారయ్యపేట, జి. సింగవరం, జి. భీమవరం, అచ్చెర్ల, మోసయ్యపేట, ఆనందపురం, చెరకాం గ్రామాల్లో మినీ వనరుల కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటికి మండల వనరుల కేంద్రం నుంచి అవసరమైన ద్రావణాలు, కషాయాలు చేరవేస్తున్నారు. వీటిని ప్రకృతి సిద్ధంగా పంటలు పండించేలా సలహాలు, సూచనలు అందిస్తూ రైతులకు తక్కువ ధరకు అందజేస్తున్నారు. ఈ సదుపాయం వల్ల తక్కువ ఖర్చుతో పంటలు పండించడానికి వీలు కలుగుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విక్రయించే ద్రావణాలు, కషాయాలు..

ప్రకృతి వనరుల కేంద్రంలో పంటల ఎదుగుదలకు, కాయల పెరుగుదలకు ఉపకరించే నిమ్మరసం, కోడిగుడ్డు కలిపిన కషాయం, పంట పూతను పెంచి దిగుబడి రావడానికి పుల్లటి మజ్జిగ, లేత కొబ్బరి నీళ్ల కలిపిన ద్రావణం, నేలను గుల్లగా మార్చడానికి, సూక్ష్మ జీవులు పెరగడానికి, తేమ శాతం పెంచడానికి ఘన జీవామృతం, అన్ని రకాల పురుగు, తెగుళ్ల నివారణకు దశపర్ణి కషాయం, కాయ, కాండం తొలిచే పెద్ద పురుగుల నివారణకు అగ్ని అస్త్రం, నాణ్యతను, రోగ నిరోధక శక్తిని పెంచడానికి, సీతా ఫలం, క్యాబేజీపై ముడత తెగులు నివారణకు పంచగవ్య ద్రావణాలు, అన్ని రకాల పురుగు తెగుళ్ల నివారణకు బ్రహ్మాస్త్రం, ఎదుగుదలకు ద్రవ జీవామృతం, చేప, బెల్లం ద్రావణం, చిన్న పురుగు, రసం పీల్చు పురుగు నివారణకు నీమాస్త్రం వంటి ద్రావణాలు, కషాయాలు అందుబాటులో ఉంచి సరసమైన ధరలకు విక్రయిస్తున్నారు. అలాగే భూసారం పెంచడానికి, భూమి సేంద్రీయ కర్బన శాతం పెంపొందించడానికి నాటే నవ ధాన్యాలు, 30 రకాల పీఎండీఎస్ విత్తనాలు 45 రోజుల్లో కోతకు రావడంతో పాటు వచ్చి రొట్ట ఎరువుగా ఉపయోగపడనుంది. వీటిని మండల వనరుల కేంద్రంలో అందుబాటులో ఉంచారు. ఈ కేంద్రాన్ని శిక్షణ పొందిన కూండ్రపు అరుణ నిర్వహిస్తున్నారు.

ద్రావణాలతో సులువుగా సాగుబడి..



ప్రకృతి వ్యవసాయం ద్వారా అర ఎకరం భూమిలో కాయగూరలు సాగు చేస్తున్నాను. ప్రధానంగా వంగ పంట వేశాను. పంట సాగుకు అవసరమైన ద్రావణాలు, కషాయాలు, విత్తనాలు ఇప్పుడు మెగా వనరుల కేంద్రంలో లభిస్తున్నాయి. గతంలో సిబ్బంది వచ్చి వీటి తయారీ గురించి తెలిపేవారు. దాని వల్ల ఖర్చు, కాలయాపన జరిగేది. ఇప్పుడు ప్రకృతి వనరుల కేంద్రంలో ఇవి రెడీమేడ్‌గా లభ్యం అవుతున్నాయి. ఆనందంగా ఉంది.

– కచ్చళ్ల నాగరాజు, సుందరయ్యపేట

కృత్రిమ ఎరువులకు చెక్..



ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలను సాగు చేసే రైతులు కృత్రిమ ఎరువులు వినియోగించకుండా మెగా ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని మండల స్థాయిలో లాలంకొత్తూరులో ఏర్పాటు చేశారు. వీటిలో ప్రకృతి వ్యవసాయానికి ఉపయోగపడే కషాయాలు, ద్రావణాలు తయారు చేసి విక్రయిస్తున్నాం. మండలంలో ఉన్న 15 ప్రకృతి వ్యవసాయ గ్రామాలకు వీటిని సిబ్బంది తీసుకెళ్లి కావలసిన రైతులకు అందజేస్తున్నారు.

– కూండ్రపు అరుణ, మెగా ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం, లాలంకొత్తూరు.

మర్రిపాలెంలో వైద్యశిబిరం



మర్రిపాలెం శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

నాతవరం : కాలానుగుణంగా వస్తున్న వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న అన్నారు. మర్రిపాలెం గ్రామంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు, ఈ శిబిరంలో 89మంది రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. పలువురు రోగులకు రక్త పరీక్షలు నిర్వహించి ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, బాలింతలు గర్భిణులకు తనిఖీలు చేశారు.

ఘనంగా వెంకన్న తిరువీధి



మేలుకొలుపులు నిర్వహిస్తున్న భక్తులు

మాడుగుల : స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్వామి వారిని గ్రామంలో ఊరేగించారు. స్వామివారు ఏడాదికొకసారి ఇళ్ల ముందుకు రావడంతో ఎదురుగా వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు.

నేతలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు



మాజీ మంత్రి అమర్‌నాథ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న గొర్లి సూరిబాబు, బుల్లిబాబు



82వ వార్డు కార్పొరేటర్ సునీత జానకీరామరాజు దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న గౌరీపరమేశ్వరుల ఉత్సవ కమిటీ సభ్యులు



మాజీ ఎంపీ సత్యవతికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రమణ అప్పారావు

కశింకోట: మాజీ మంత్రి, విశాఖ జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్‌ను మిందిలోని స్వగ్రామంలో అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబుతో పాటు జిల్లా వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మాజీ ఎంపీ సత్యవతికి శుభాకాంక్షలు..

అనకాపల్లి: మాజీ ఎంపీ బీవీ సత్యవతి కార్యాలయలో నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి రమణ అప్పారావు, జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ బి.వరాహ సత్యవతి తదితరులు పాల్గొన్నారు. మండల పరిషత్ ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు కార్యాలయంలో ఎంపీపీ సూరిబాబు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఎంపీడీవో కె.వి.నరసింహం తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ విజయకృష్ణన్‌కు జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు రేబాక మధుబాబు శుభాకాంక్షలు తెలిపారు. 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత జానకీరామరాజు దంపతులకు వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల అమ్మవారి ఉత్సవ కమిటీ సభ్యులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీష్ కార్యాలయంలో, గవరపాలెం సంతోషిమాత అమ్మవారి ఆలయ రహదారిలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, గవరపాలెం సంతబయలు వద్ద ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు కూటమి నేతలు నూతన సంవత్స శుభాకాంక్షలు తెలిపారు.

కోలాటం కళాకారులకు చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న జ్యోతికుమార్

ఎస్.రాయవరం: కొత్త సంవత్సరం సందర్భంగా ఎస్.రాయవరం గ్రామంలో కోలాటం ఆడుతున్న 50 మంది మహిళా కళాకారులకు గోకులపాడు యూత్ సంఘ నాయకుడు లింగంపల్లి జ్యోతికుమార్ బుధవారం చీరలు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరికి ఏదో ఒక ప్రత్యేక ఉంటుందని, వాటిపై దృష్టి పెడితే మంచి ఫలితాలు సాధించవచ్చని ఆయన అన్నారు.

4న వినికిడి యంత్రాల పంపిణీకి వైద్య శిబిరం



మాట్లాడుతున్న నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న

నాతవరం : వినికిడి సమస్య ఉన్న వారికి ఈనెల 4వ తేదీన నర్సీపట్నంలో ఉచితంగా వినికిడి యంత్రాలు అందించేందుకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నారని నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న అన్నారు. ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడుతూ డిసెంబరు 30వ తేదీన నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో వినికిడి సమస్య ఉన్న వారిని పరిక్షించేందుకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారన్నారు. ఆ రోజు డివిజన్ స్థాయిలో గల అన్ని మండలాల నుంచి అధిక సంఖ్యలో వినికిడి సమస్య ఉన్నవారు రావడంతో తక్కువ మందిని మాత్రమే పరీక్షించడం జరిగిందన్నారు. సమయం చాలక చాలా మందిని పరిక్షించకపోవడంతో అధిక సంఖ్యలో వెనుదిరిగారన్నారు. ఈ విషయంపై వైద్యశాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి మండలాలు వారీగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారన్నారు. నాతవరం మండలం వారికి 4వ తేదీన శనివారం ఉదయం 10 గంటల నుంచి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో ప్రత్యేక వైద్యులతో వినికిడి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. వైద్య శిబిరానికి వెళ్లే వారు ఆధార్ కార్డు , రేషన్ కార్డు జెరాక్స్ కాపీలు, రెండు పాస్ ఫొటో సైజు ఫొటోలు వెంట తీసుకెళ్లాలన్నారు.

వైభవంగా సింహాద్రి అప్పన్న ఆలయ వార్షికోత్సవం



సింహాద్రప్పన్నకు పూజలు చేస్తున్న భక్తులు

కె.కోటపాడు : గొండుపాలెం గ్రామస్తులు సింహాద్రప్పన్న ఆలయ 9వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా జరిపారు. వార్షికోత్సవ కార్యక్రమాన్ని గ్రామానికి చెందిన గౌరీ సేవా సంఘం వారు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో పూజా కార్యక్రమాల అనంతరం గ్రామంలో సింహాద్రప్పన్న ప్రతిరూపంగా కొలిచే తోడపెద్దుతో పాటు ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో గల ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనడంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధనను నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మద్దాల రాజేంద్రప్రసాద్, మద్దాల రాము, జగ్గారావు, అప్పారావు, దేముడు, మాజీ గోవాడ సుగర్ ఫ్యాక్టరీ డైరెక్టర్ దొగ్గ ఉమాశంకర్ పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో న్యూఇయర్ వేడుకలు



కశింకోటలోని ఓ వీధిలో ఇళ్ల ముందు రంగు రంగుల ముగ్గులు



కశింకోటలోని ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరంలో ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు

అనకాపల్లి: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా వైఎస్సార్‌సీపీ పాలన సాగితే కూటమి పాలనలో బడుగు, బలహీన వర్గాల ప్రజలు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో అనేక పథకాలతో పండగలను సంతోషంగా నిర్వహించుకునే వారు అన్నారు. కూటమి ప్రభుత్వం ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా అమలు చేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకు విజన్ 2047 అనే కొత్త ఎత్తుగడతో మరోసారి మోసగించేందుకు చూస్తున్నారని అన్నారు. అనంతరం పార్టీశ్రేణులు గజమాలలతో భరత్‌కుమార్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో 82,83 వార్డుల కార్పొరేటర్లు మందపాటి సునీత, జాజుల ప్రసన్నలక్ష్మి, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు దంతులూరి దిలీప్‌కుమార్, బొడ్డేడ ప్రసాద్, పట్టణ పార్టీ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు, ఎంపీపీ గొర్లి సూరిబాబు, అనకాపల్లి, కశింకోట మండల అధ్యక్షులు పెదిశెట్టి గోవింద్, మలసాల కిషోర్, పట్టణ యువజన విభాగం అధ్యక్షులు 1, 2, ఉగ్గిన అప్పారావు, వేగి త్రినాథ్, గవర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ, 80వ వార్డు ఇన్‌చార్జి కె.ఎం.నాయుడు, పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పార్టీ సీనియర్ నాయకులు దాడి నారాయణరావు, నీటిపల్లి లక్ష్మి, ఎం.శోభ, కోరుకొండ రాఘవ, గైపూర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

కశింకోటలో..

కశింకోట: మండలంలోని ప్రజలు నూతన సంవత్సర వేడుకలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఇళ్ల ముందు అందంగా ముగ్గులు వేశారు. పూలతో అలంకరించారు. పరస్పరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కశింకోటలోని ఆంధ్ర కల్వరీ బాప్టిస్టు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ సన్నీ జేమ్స్, సర్పంచ్ మంత్రి జయరజని, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజిమెన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక గవరపేటలోని ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరంలో పాస్టర్ మూర్తి జేమ్స్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి క్రైస్తవులు ప్రార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తును స్తుతించారు. అలాగే స్థానిక షాలెం మందిరం, బయ్యవరం, తాళ్లపాలెం, ఉగ్గినపాలెం, జమాదులపాలెం, జి. భీమవరం, అచ్చెర్ల, సుందరయ్యపేట, కన్నూరుపాలెం, తీడ, చెరకాం, గొబ్బూరు, చింతలపాలెం, నరసింగబిల్లి, నూతలగుంటపాలెం, సోమ వరం, ఏనుగుతుని, ఏఎస్ పేట, కొత్తపల్లి, తేగాడ, బుచ్చియ్యపేట, పేరంటాలపాలెం తదితర గ్రామా ల్లోని చర్చిల్లో కూడా ప్రార్థనలు నిర్వహించారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో..

తుమ్మపాల: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఏఐటీయూసి జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. మండలంలో మూలపేట గ్రామంలో భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నూతన సంవత్సరంలో సంక్షేమ బోర్డు పునరుద్ధరించి కార్మికులు కుటుంబాలను ఆదుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న క్లెయిములు వెంటనే మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సీహెచ్ అప్పలరాజు, సహాయ కార్యదర్శి చిన్ని, గణేష్, చిన్ని, గుమ్మాల నాగేశ్వరరావు, సత్తిబాబు, పల్లా నర్సింగరావు, తోట రమణ శేషు, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో..

కశింకోట: కశింకోట ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కలగా లక్ష్మిని ఎంపీడీవో వి.వి. రవికుమార్, సిబ్బంది, సచివాలయ సిబ్బంది కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావుకు రెవెన్యూ సిబ్బంది కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మేలుకొలుపు



కె.వెంకటాపురంలో మేలుకొలుపు చేస్తున్న భక్తులు



దోసూరు శివారు గండివానిపాలెంలో మేలుకొలుపు నిర్వహిస్తున్న భక్తులు

కోటవురట్ల: కె.వెంకటాపురంలో బుధవారం మేలుకొలుపు కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువజామునే రామాలయానికి చేరుకున్న భక్తులు పూజలు చేసిన అనంతరం వీధుల్లో రామనామ సంకీర్తన చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

అచ్యుతాపురం: ధనుర్మాసం విష్ణువుకు అత్యంత ప్రీతికరమైన మాసమని సమరసతా సేవా ఫౌండేషన్ యలమంచిలి సబ్ డివిజన్ ధర్మ ప్రచారకుడు కొల్లి అప్పారావు అన్నారు. అచ్యుతాపురం మండలం దోసూరు శివారు గండివానిపాలెంలో బుధవారం నిర్వహించిన మేలుకొలుపు కార్యక్రమంలో ఆయన పాల్గొని ధనుర్మాసం విశిష్టతను వివరించారు. సూర్యుడు మకర రాశిలో ప్రవేశించిన నాటి నుంచి ఉత్తరాయనం మొదలవుతుందని తెలిపారు. గోదాదేవి ధనుర్మాసం అంతా స్వామిని కీర్తించి స్వామిని చేరిందన్నారు. ధనుర్మాసంలో తెల్లవారు జామున చేసే మేలుకొలుపులు, నామ సంకీర్తన చాలా మేలు చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు గండి అప్పారావు, రాజు, రవి, గండి సురేశ్, నాయుడు, దేవి, రాజేశ్వరి, సబ్బవరపు చిన్నికృష్ణ, ఆత్మకూరు వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

అచ్యుతాపురం: భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము డిమాండ్ చేశారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా మండలంలోని హరిపాలెం, అచ్యుతాపురం, పూడిమడక, దోసూరు గ్రామాల్లో కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కేకులు కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుంటూ సందడి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న క్లయిమ్‌లు అందజేయాలన్నారు. ప్రమాదాలకు గురైన కార్మికులకు ప్రభుత్వం వైద్యం అందించడంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రాజాన అప్పలనాయుడు, శ్రీను, రమేశ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.